VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత ఐదు సంవత్సరాల నుండి నిరంతరాయంగా వెలువడుతున్న
' విభారె ' తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ లోని అన్ని జిల్లా కేంద్రాలో
బ్యూరోలు మరియు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గ మరియు
మండలాల వారీగా విలేఖరులు కావలెను
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్,
8143193697, 9440232308

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 28-04-2023 సంపుటి : 04 సంచిక : 210 పేజీలు : 4 వెల : రూ 3-00

నారా లోకేష్

# బీసీలకు స్వర్ణయుగం తెస్తాం..





మంత్రాలయం మంత్రాలయం లో టీడీపీ నేత నారా లోకేష్ పాదయాత్రలో భాగంగా బీసీ సామాజికవర్గం ప్రతినిధులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. మంత్రాలయం నియోజకవర్గం బీసీ నేతలు మాట్లాడుతూ బోయ, వాల్మీకి లను ఎస్టీల్లో చేరుస్తామని జగన్ మోసం చేశారు. బోయ, వాల్మీకిలకి ఎటువంటి కుల వృత్తి లేదు. బిసిలకు అమలు అయ్యే ఏ సంక్షేమ కార్యక్రమం మాకు అందడం లేదు. మాదాసి కురువ లకు జగన్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. టిడిపి హయాంలో గొర్రెల పెంపకం కోసం సహాయం అందించేవారు. ఇప్పుడు ఆ సంక్షేమ కార్యక్రమాలు జగన్ ప్రభుత్వం ఆపేసిందని అన్నారు. వడ్డెర కులస్తులను జగన్ ప్రభుత్వం మోసం చేసింది. మాకు కార్పొరేషన్ ద్వారా ఎటువంటి రుణాలు అందడం లేదు. కల్లు గీత కార్మికులను వైసిపి ప్రభుత్వం కోలుకోలేని దెబ్బకొట్టింది. రజకులను జగన్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తుంది. ఎటువంటి సహాయం అందడం లేదు. మత్స్యకారులను జగన్ ప్రభుత్వం వేధిస్తుందని అన్నారు.నారా లోకేష్ మాట్లాడుతూ బీసీ ల భద్రత కోసం టిడిపి అధికారంలోకి రాగానే బీసీ రక్షణ చట్టం తీసుకొస్తాం. న్యాయ పోరాటానికి అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే శాశ్వత బీసీ కుల ధృవీకరణ పత్రాలు అందజేస్తాం. ఫోన్లో ఒక్క బటన్ నొక్కగానే ప్రభుత్వమే మీ ఇంటికి శాశ్వత కుల ధృవీకరణ పత్రాలు అందజేసే విధానం తీసుకొస్తాం. దామాషా ప్రకారం బీసీ ఉప కులాలకు నిధులు కేటాయిస్తాం. సబ్సిడీ రుణాలు అందిస్తాం. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదరణ పథకం తిరిగి ప్రారంభిస్తాం. జగన్ కాన్వాయ్ కి అడ్డం పడుకొని నిరసన తెలిపిన రైతుల్ని ఆదర్శంగా తీసుకొని అందరూ ప్రభుత్వం పై పోరాడాలి. ఉప కులాల వారీగా ముందు నియోజకవర్గం స్థాయిలో, ఆ తరువాత మండల స్థాయిలో కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేస్తాం. బోయ, వాల్మీకి లను జగన్ నమ్మించి మోసం చేశారని అన్నారు.ఎన్నో సార్లు జగన్ ప్రధానిని కలిశారు. ఒక్క సారి అయినా బోయ, వాల్మీకి లను ఎస్టీల్లో చేర్చాలని అడిగారా? అంత మంది ఎంపిలు ఉన్నారు ఒక్క రోజైనా పార్లమెంట్ లో ఈ అంశం గురించి మాట్లాడారా?టిడిపి హయాంలో సత్యపాల్ కమిటీ వేసి అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. జగన్ నాలుగేళ్లుగా డ్రామాలు ఆడి ఇప్పుడు కేవలం 4 జిల్లాలో ఉన్న బోయ, వాల్మీకి లను ఎస్టీల్లో చేర్చాలని కొత్త తీర్మానం చేసి మీకు తీరని అన్యాయం చేశారు.కల్లుగీత కార్మికుల పొట్ట కొట్టాడు జగన్. చెట్లను కొట్టేయడం తో పాటు అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. జగన్ సొంత మద్యం అమ్ముకోవడానికి కల్లు గీత కార్మికులను ఇబ్బంది పెడుతున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నీరా కేఫ్ లు ఏర్పాటు చేస్తాం. మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పిస్తాం. చెట్ల పెంపకం కోసం సహాయం అందిస్తాం. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు రజకులకు వాషింగ్ మెషీన్, ఐరెన్ బాక్సులు అందజేసాం. దోబి ఘాట్స్ ఏర్పాటు చేశాం. ఉచిత విద్యుత్ అందజేసాం. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వాషింగ్ మెషీన్ తో పాటు రజకులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తామని అన్నారు.రజకులకి ఎమ్మెల్సీ ఇస్తానని మోసం చేసింది జగన్. మంత్రాలయం లో మత్స్యకారులను వేధిస్తున్నాడు ఇక్కడ ఎమ్మెల్యే విష నాగని అన్నారు. వైసిపి పెత్తందారుల చేతిలోకి వెళ్లిపోయిన చెరువులు అన్ని తిరిగి మత్స్యకారులకు కేటాయిస్తాం. మత్స్యకారుల పొట్ట కొట్టేలా జగన్ తెచ్చిన జీఓ లు అన్ని రద్దు చేస్తామని అన్నారు. బీసీలకు నిజమైన రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చింది టిడిపి వలనే. బిసిలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించింది టిడిపి. ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందించాం. ఆదరణ 2 లో కొన్న పనిముట్లు బిసిలకు ఇవ్వకుండా వాటిని తుప్పు పట్టేలా చేసింది జగన్ ప్రభుత్వం. జగన్ స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లు కట్ చేసి 16,500 మంది బీసీలను పదవులకి దూరం చేశారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 26 వేల మంది బీసిలపై కేసులు పెట్టి వేధించారు. జగన్ పాలనలో బీసీలకు కుల ధృవీకరణ పత్రం తీసుకునే హక్కు కూడా లేకుండా పోయింది. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గొర్రెల కాపరులను ఆదుకుంటాం. గొర్రెలు కొనడానికి సబ్సిడీ రుణాలు అందిస్తాం. మందులు, దాణా, మేత సబ్సిడీ లో అందిస్తాం. ఇన్స్యూరెన్స్ పథకం అమలు చేస్తాం. కనకదాస జయంతిని రాష్ట్ర పండుగ గా జరపాలని నిర్ణయం తీసుకున్నాం. బీరప్ప దేవాలయాలు నిర్మాణం కోసం సహాయం చేస్తాం. అర్చకులకు గౌరవ వేతనం కూడా అందిస్తాం. వడ్డెర కులస్తులను జగన్ ప్రభుత్వం వేధిస్తుంది. టిడిపి హయాంలో వడ్డెర కులస్తులకు కేటాయించిన మైన్లను జగన్ ప్రభుత్వం లాక్కుంది. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే మీ మైన్ల ను మీకు తిరిగి ఇస్తాం. పాలిచ్చే ఆవుని వద్దనుకొని, తన్నే దున్నపోతు తెచ్చుకున్నారు.

# జీఎస్టీతో నల్లధనానికి చెక్ పెట్టాం

డీబీటీతో అవినీతి అంతమైంది
దీంతో అవినీతిపరులు తనపై కోపంగా ఉన్నారు
ఓ జాతీయ ఛానెల్ సమ్మిట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ ఏప్రిల్ 27 ఓ జాతీయ ఛానెల్ సమ్మిట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీతో నల్లధనానికి చెక్ పెట్టామన్నారు. డీబీటీతో అవినీతి అంతమైందని, దీంతో అవినీతిపరు లు తనపై కోపంగా ఉన్నారని మోదీ చెప్పారు. సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు చేకూరుతోందన్నారు. హౌజింగ్ స్కీమ్, ముద్ర రుణాల గురించి ప్రధాని ప్రస్తావించారు. మూడు కోట్ల 75 లక్షల మందికిపైగా ఇళ్లు కట్టించి ఇచ్చామన్నారు. ఇంటి యాజమాన్య హక్కులు మహిళలకు ఇచ్చామని, కోట్లాది మంది సోదరీమణులు లక్షాధికారులయ్యా రని ప్రధాని చెప్పారు. తమకు అందుతున్న వాటాతో పేద ప్రజలు సామాజిక న్యాయం జరుగుతోందని భావిస్తున్నారని మోదీ చెప్పారు. ముద్రా పథకం ద్వారా కోట్లాది మంది చిరువ్యాపారులకు రుణాలు అందించామన్నారు.తమ తొమ్మిదేళ్ల పాలనలో 9వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి భారత్ ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని ప్రధాని చెప్పారు. 9 సంవత్సరాలుగా దళితులు, పేదల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకొచ్చామని మోదీ చెప్పారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా పేద ప్రజల కోసం 80 వేల కోట్లు ఖర్చుపెట్టామన్నారు. కోవిడ్ సమయం నుంచి నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలతో పేద ప్రజలకు అన్న యోజన ద్వారా ఉచితంగా బియ్యం అందిస్తున్నామని ప్రధాని చెప్పారు. మన్‌రేగా డబ్బులు కార్మికులకు 15 రోజుల్లోనే అందుతున్నాయని చెప్పారు. లక్షల కోట్లు దుర్వినియోగం కాకుండా కాపాడామన్నారు.కోవిడ్ సమయంలో అత్యంత నాణ్యమైన స్వదేశీ వ్యాక్సిన్లు తయారు చేశామని మోదీ చెప్పారు. ఇతర దేశాల వాళ్లు తయారు చేస్తున్నప్పుడు దేశీయంగా వ్యాక్సిన్లు తయారు చేయడం ఎందుకని కొందరు ప్రశ్నించారని మోదీ గుర్తు చేశారు. ఇతర దేశాలకు కూడా వ్యాక్సిన్లు పంపిణీ చేశామన్నారు.డిజిటల్ ఇండియాను కూడా పక్కదారి పట్టించేందుకు కొందరు యత్నించారని మోదీ చెప్పారు. డిజిటల్ ఇండియా ద్వారా దేశ ఆర్థిక స్వరూపాన్నే మార్చేశామ న్నారు. చాయ్ దుకాణం నుంచి కూరగాయల దుకాణాల వరకూ డిజిటల్ పేమెంట్స్ అవుతున్నాయని మోదీ చెప్పారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ పేమెంట్స్ భారత్‌లోనే జరుగుతున్నాయని మోదీ గుర్తు చేశారు.

## ఏపీ సర్కార్‌కు అరుదైన అవార్డు.. అధికారులకు సీఎం జగన్ ప్రశంసలు

తాడేపల్లి: ఏపీ ప్రభుత్వానికి అరుదైన అవార్డు లభించింది. ప్రతిష్టాత్మక గోల్డ్ అవార్డును స్కోచ్ సంస్థ ప్రదానం చేసింది.పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో రుణాలు అందించడం, ఆ రుణాలను సద్వినియోగం చేసుకోవటం.. సకాలంలో తిరిగి చెల్లించడంలో అత్యుత్తమ ఫలితాలను సాధించడంలో ఏపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. ఈ సహాయ సహకారాలకు గాను ఏపీ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మక స్కోచ్ సంస్థ గోల్డ్ అవార్డు వరించింది.ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి పొదుపు సంఘాల మహిళలకు సులభ విధానంలో రుణాలు అందేలా స్త్రీ నిధి సంస్థ కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అవార్డులను అధికారులు చూపించారు. ఈ సందర్భంగా అధికారులను సీఎం ప్రశంసించారు.



# పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై సమీక్ష..

సీఎం జగన్ కీలక ఆదేశాలు

తాడేపల్లి: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష చేపట్టారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ ఈ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మహిళల స్వయం సాధికారిత కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. చేయూత, ఆసరా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం లాంటి పలు పథకాల ద్వారా వారికి జీవనోపాధి కల్పించే మార్గాలను మరింత విస్తృతం చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. చేయూత కింద అర్హత సాధించిన లబ్ధిదారులకు వరుసగా నాలుగేళ్లపాటు క్రమం తప్పకుండా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని సీఎం అన్నారు.అలానే ఆసరా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాల కింద కూడా నిర్ణయించిన వ్యవధి మేరకు క్రమం తప్పకుండా వారికి ఆర్థిక సహాయం అందుతుందని సీఎం అన్నారు. ఈ డబ్బు వారి జీవనోపాధికి ఉపయోగపడేలా ఇప్పటికే ప్రభుత్వం బ్యాంకుల సహాయంతో స్వయం ఉపాధి మార్గాలను అమలు చేస్తోందని, దీన్ని మరింత విస్తృతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

లబ్ధిదారులకు పథకాన్ని అందుకునే మొదటి ఏడాదినుంచే వారిని స్వయం ఉపాధి



మార్గాలవైపు మళ్లించే కార్యక్రమాలను మరింత పెంచాలని, దీనివల్ల గ్రామ స్థాయిలో సుస్థిర ఆర్థిక ప్రగతి దిశగా వేగంగా అడుగులుపడతాయన్న సీఎం

అర్హులైన మహిళల్లో మరింత అవగాహన కల్పించి బ్యాంకుల నుంచి కూడా రుణాలు ఇప్పించి ఉపాధి కల్పించే మార్గాలను సమర్థవంతంగా కొనసాగించాలన్న సీఎం

మహిళలు తయారు చేస్తున్న వస్తువులు, ఉత్పాదనలకు సంబంధించి మంచి మార్కెట్ వ్యవస్థ ఉండాలన్న సీఎం

దీనికోసం బహుళజాతి కంపెనీలతో అనుసంధానం కావాలన్న సీఎం

45-60 సంవత్సరాల వయస్సు మధ్యలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల సాధికారతే లక్ష్యంగా చేయూత పథకం

ఇప్పటివరకూ చేయూత పథకం ద్వారా 9 లక్షలమంది స్వయం ఉపాధి పొందుతున్నారని అధికారులు వెల్లడి

హిందుస్తాన్ యూనీలీవర్, ఐటీసీ లిమిటెడ్, రిలయెన్స్, అజియో, జీవీకే, మహేంద్ర, కాలాగుడి, ఇర్మా, నైనా, పీ అండ్ జీ వంటి అంతర్జాతీయ సంస్థలతో ఇప్పటికే ఒప్పందాలు జరిగాయన్న అధికారులు.

## కోడెల ఆత్మహత్యకు ఆయనే కారణం

- అంబటి రాంబాబు

గుంటూరు ఏపీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు చావుకు ప్రధాన కారణం చంద్రబాబే అని మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. సత్తెనపల్లిలో చంద్రబాబు చేసిన రోడ్ షో అట్టర్ ఫ్లాఫ్ అని అన్నారు. సత్తెనపల్లిలో చంద్రబాబు కార్యక్రమానికి జనాలు ఎవరూ రాలేదని, రాకపోయినా వచ్చారని చెప్తూ మహా అద్భుతం అంటున్నారని ఎద్దేవా చేశారు. నిజం చెప్తే చంద్రబాబు తల వెయ్యి ముక్కలయ్యేలా శాపం ఉందని, అందులో భాగంగానే సత్తెనపల్లిలో కూడా చంద్రబాబు ఒక్క నిజం కూడా మాట్లాడలేదని ఎగతాళి చేశారు. మంత్రి అంటి రాంబాబు గురువారం మీడియాతో మాట్లాడారు.” నీ కన్నా, నీ కొడుకు కన్నా, కొడెల శివప్రసాద్ కన్నా.. వంద రెట్లు నీతి మంతుణ్ని నేను. తెలుగు దేశం నాయకులకు కూడా అన్యాయం జరగకూడదని భావించే మంచి వ్యక్తిని నేను. నన్ను ఆంబోతు అంటారా? చంద్రబాబు ఎక్కడ పుట్టారు.. ఎక్కడ పెరిగారు. ఆయన జీవితం అంతా ఆంబోతులకు ఆవులు సప్లై చేయడమే సరిపోయింది. “చంద్రబాబు పదే పదే సైకో పోవాలి, సైకిల్ రావాలని అంటున్నారని, చంద్రబాబే ఒక రాజకీయ సైకో అంటూ సీరియస్ అయ్యారు. అధికారం లేకపోతే చంద్రబాబు బతకలేడని వ్యాఖ్యానించారు. రెక్కల కష్టంలో పార్టీని ఒంటి చేత్తో నిలబెట్టిన జగన్ సీఎంగా అనర్హుడా? అని ప్రశ్నించారు. మరి చంద్రబాబు, నారా లోకేష్ మాత్రమే అర్హులా? అని అడిగారు. ఈ 40 ఏళ్ల రాజకీయ జీవితంలో చంద్రబాబు అసలు పేదలకు మంచి చేశారా అని నిలదీశారు. సీఎం జగన్ పేద ప్రజలకు రెండు లక్షల కోట్ల డబ్బులను వారి ఖాతాల్లో వేసి ధనవంతులుగా చేసే ప్రయత్నం చేశారని అన్నారు.

# జగన్ ప్రభుత్వం వేధింపుల వల్లే కోడెల ఆత్మహత్య



టీడీపీ అధినేత చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

సత్తెనపల్లి ఏప్రిల్ 27 మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ రావు ఆత్మహత్యపై టీడీపీ అధినేత చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో పర్యటించిన ఆయన అక్కడ జరిగిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కోటప్పకొండ అంటే కోడెల శివప్రసాదరావు గుర్తు వస్తారని తెలిపారు. అంతగా ఆయన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని కొనియాడారు. పల్నాటి పులిగా ఉన్న కోడెలను జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేధించిందని.. అవమానించి ఆయన ఆత్మహత్య చేసుకునేలా చేసిందని చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు.చెరువులో ఎన్టీఆర్ విగ్రహం ఆధునికీకరణ మనిషి మరణించినా గౌరవప్రదంగా అంత్యక్రియల నిర్వహణకు శ్మశానాల అభివృద్ధి ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్ల నిర్మాణాన్ని కోడెల శివప్రసాద్ చేపట్టారని గుర్తు చేశారు. పల్నాటి పులిగా ఉన్న ఆయన తన జీవితంలో ఎవరికీ భయపడలేదన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ఆ రోజుల్లోనే క్యాన్సర్ ఆస్పత్రి కోసం విశేష కృషి చేశారని కొనియాడారు.జగన్ వచ్చాక కోడెలను వేధించి అవమానించి ఆత్మహత్య చేసుకునేలా చేశారని మండిపడ్డారు. అలాంటి మంచి వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన జగన్ ను చరిత్ర క్షమించదని చంద్రబాబు హాట్ కామెంట్స్ చేశారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. 2014లో టీడీపీ గెలిచాక కోడెల శివప్రసాదరావు శాసనసభ స్పీకర్ గా బాధ్యతలు చేపట్టారు. వైసీపీ నుంచి గెలిచిన 23 మంది ఎమ్మెల్యేలు టీడీపీలో చేరినా స్పీకర్ గా కోడెల వారిపై అనర్హత వేటు వేయలేదని వైసీపీ తీవ్ర విమర్శలు చేసింది. అలాగే శాసనసభలో తమకు మాట్లాడటానికి అవకాశం ఇవ్వకుండా వేధించారని కోడెలపై వైసీపీ ఆరోపణలు చేసింది. లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కోడెల శివప్రసాద్ కుమారుడు కుమార్తె టీడీపీ ప్రభుత్వ హయాంలో కే ట్యాక్స్ పేరుతో సత్తెనపల్లి నరసరావుపేట నియోజకవర్గాల్లో వ్యాపారులు దుకాణాదారులు కాంట్రాక్టర్ల నుంచి భారీగా నగదు వసూలు చేశారని కేసులు నమోదు చేసింది.

# సంపాదకీయం

శుక్రవారం 28-04-2023

## వన్ నేషన్..వన్ క్రాప్ ఇన్సూరెన్స్ సాధ్యం కాదా...

అకాల వర్షంతో రైతన్న కుదేలయ్యాడు. ఏ రైతును కదిలించినా కన్నీళ్ళే వస్తున్నాయ్. వరుస అకాల వర్షాలతో రైతులు బోరుమంటున్నారు. కళ్లెదుటే చేతికి వచ్చిన పంట నష్టపోవడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షంతో అన్నదాతల నెత్తిన పిడుగుపడింది. పెట్టిన పెట్టుబ డులు వర్షార్పణం అయ్యాయి. పంటలు వస్తే అప్పులు తీర్చుకుని కొత్త పంటలు వేద్దామన్న ఆశతో ఉన్న అన్నదాతను అకాల వర్షం దొంగ దెబ్బతీసింది. ఈ నెలలోనే వరుసగా మూడు మార్లు అకాల వర్షం అన్నదాతపై కోలుకోలేని దెబ్బ తీసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట.. చేతికొచ్చే సమయంలో నీళ్లపాలవుతుండం ఒక రివాజుగా మారిపోయింది. నష్టాల అంచనాలతో కాలక్షేపం చేయకుండా... కాలయాపన జరక్కుండా అన్నదాతను ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాల వారీగా, గ్రామాల వారీగా పంట నష్టాలను గుర్తించాలి. రైతులకు భరోసా ఇవ్వాలి. ఈదురుగాలులు వాన, వడగళ్ల దెబ్బతో పంట పొలంలో ఉన్న వరి చేనులో గింజలన్నీ నేలపాలయ్యాయి.. ఇక కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం కుప్పలన్నీ వర్షం ధాటికి తడిసిపోయాయి. పలు మార్కెట్ యార్డుల్లో ధాన్యం వరద పాలైంది. పలుచోట్ల టార్పాలిన్ కవర్లను కప్పి అన్నదాతలు కాపాడుకునే ప్రయత్నం చేశారు. రెక్కల కష్టమిలా వర్షార్పణం కావడంతో కలత చెందారు. గత నెలలో అకాల వర్షాల ధాటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15,801 ఎకరాల పంట 33 శాతానికిపైగా నష్టపోయినట్లు అధికారులు అంచనా వేశారు. ఇటీవల రెండ్రోజులుగా కురిసిన వానలతో నాలుగు జిల్లాల పరిధిలో మరో 40 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో కరీంనగర్ జిల్లాలోనే 23 వేల ఎకరాలకుపైగా నష్టం వాటిల్లింది. ఇక ఇదే విషయంపై ప్రతిపక్షలు కేసీఆర్ పై విరుచుకుపడ్డారు. ఎనిమిదేళ్ల పరిపాలనలో నష్టపోయిన రైతాంగానికి ఒక్క రైతుకైనా పరిహారం ఎందుకు ఇవ్వలేదన్నారు. నిర్ణీత సమయంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం వల్లే, ఆ కేంద్రాలను తెరవక పోవడం వల్లే నేడు చాలా మంది రైతులు నష్ట పోయారన్నారు. పండించిన ధాన్యం కొంటానన్నావ్ కొనుగోలు కేంద్రాలు ప్రారంబించవు.. అన్నీ కోతలేనా కేసీఆర్. కనీస మద్దతు ధరకు తోడుగా ఏనాడైనా వరికి రూ.500 రూపాయల బోనస్ చెల్లించావా అని ప్రశ్నించారు. మొక్కజొన్న, వరి, మామిడి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వేలాది ఎకరాల్లో కోట్లాది రూపాయల విలువ చేసే పంట నష్టం జరిగింది. . ఇప్పటికైనా సమగ్ర పంటల బీమా ను కూడా వన్ నేషన్ వన్ క్రాప్ ఇన్సూరెన్స్ పద్ధతికి మార్చాలి. దేశంలో ఉన్న ఇన్సూరెన్స్ కంపెనీలతో చర్చించి సమగ్ర పంటలబీమా పథకం రచించాలి. భుత్వం ప్రకారం ఉత్పత్తి ప్రమాదం నుంచి రైతులను రక్షించడమే కాకుండా ఈ పథకాలు ఆహార భద్రత, పంటల వైవిధ్యం, వ్యవసాయ రంగం వృద్ధి, పోటీతత్వాన్ని పెంచడానికి దోహదం చేస్తాయి. ఈ పథకాలు ఖరీఫ్ పంటలకు 2 శాతం, రబీ పంటలకు 1.5 శాతం, వార్షిక వాణిజ్య/ఉద్యాన పంటలకు 5 శాతం అతి తక్కువ ప్రీమియంతో పంట నష్టాలని కవర్ చేస్తాయి. 50:50 నిష్పత్తి ఆధారంగా ప్రీమియం బ్యాలెన్స్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు షేర్ చేసుకుంటాయి. రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నోటిపై చేసిన ప్రాంతాలు, పంటలకి ఇవి వర్తిస్తాయి. అంతేకాకుండా రుణం పొందిన రైతులకు ఈ పథకాలు తప్పనిసరిగా ఉంటాయి. రుణం పొందని రైతులకు స్వచ్ఛందంగా ఉంటాయి. దీంతో పాటు ప్రధానమంత్రి బీమా యోజన,ప్రధాన మంత్రి కిసాన్ యోజన ఉండనే ఉన్నాయి. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వాలతో ప్రమేయం లేకుండా సాయం అందేలా చూడాల్సిన అవసరం ఉంది. అప్పుడు ప్రభుత్వాలు మాది రైతు ప్రభుత్వం అని చెప్పుకోగలుగుతాయి.

# మొన్న కాణిపాకం - నేడు సింహాచలం

విజయవాడ, ఏప్రిల్ 27, చందనోత్సవం సందర్భంగా సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారని సింహాద్రి అప్పన్న దేవస్థానం, అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై వివరణలు ఇచ్చుకుంటున్న ప్రభుత్వానికి మరో వివాదం చుట్టుముట్టింది. సింహాంద్రి అప్పన్న స్వామి నిజరూప దర్శన వీడియో సోషల్ మీడియాలో కనిపించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వయంభూ మూర్తులు, మూలవిరాట్‌ను ఫొటోలు తీయడం కానీ, వీడియోలు తీయడం కానీ నిషేధం. అలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటా ఉంటారు. అయితే మొన్న జరిగిన చందనోత్సవంలో భాగంగా దర్శనానికి వచ్చిన వ్యక్తుల్లో కొందరు వీడియో తీసి సోషల్ మీడియా పెట్టడం ఇప్పుడు దుమారం రేపుతోంది. గతేడాది కూడా ఇలానే కొందరు వ్యక్తులు నిజరూపాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఆ ఘటనపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు తాజాగా అలాంటి ఘటనే మళ్లీ జరిగింది. వరుసగా రెండేళ్లు ఇలా జరగడంపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోనూ రాష్ట్రమంత్రి గన్‌మన్ ఒకరు తీశారని ప్రచారంలో ఉంది. వీడియో తీస్తున్న విషయాన్ని గమనించిన దేవాదాయశాఖాధికారులు ఆయన సెల్‌ఫోన్ లాక్కున్నట్టు సమాచారం. అయినా వీడియో బయటకు రావడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతేడాది జరిగినప్పుడే సీరియస్‌గా అధికారులు చర్యలు తీసుకొని ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని అంటున్నారు సింహాద్రి అప్పన్న భక్తులు. చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరచూ వివాదాల కారణంగా వార్తల్లో నిలుస్తోంది. అధికారుల నిఘా వైఫల్యం బయటపడిందని భక్తులు మండిపడుతున్నారు. వైసీపీ నాయకుడు బాలవెంకటరెడ్డి యాదవ్ దంపతులు ఆలయానికి వచ్చారు. వారితో పాటు వచ్చిన అనుచరుడు ఒకరు దర్శన సమయంలో మూలవిరాట్ ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అధికారులు, అర్చకులు ఎవరూ దీన్ని అడ్డుకోలేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ భారతదేశంలో ప్రముఖ వాయు లింగ క్షేత్రంగా ప్రఖ్యాతిగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇటీవల సింగర్ మంగ్లీ చిత్రీకరించిన పాట వివాదాస్పదంగా మారింది. శ్రీకాళహస్తీ ఆలయంలోకి ఎటువంటి సెల్ఫోన్లు, కెమెరాలు, అనుమతించమంటూ ఆలయ అధికారులు, పాలక మండలి విధించిన ఆంక్షలు పక్కన పెట్టి ఆలయ అధికారులే మంగ్లీ పాటల చిత్రీకరణకు అనుమతించారు. ఆలయం లోపలికి కెమెరాలు తీసుకుని వెళ్లి పాట చిత్రీకరణ చేశారు. ముక్కంటి ఆలయంలోనే పాటలు చిత్రీకరణ రాహుకేతు సర్ప దోష పూజ మండపంలో, కాళభైరవ ఆలయం ముందు భాగంలో మంగ్లీ పాటను చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. జ్ఞానప్రశూంనాభ, వాయులింగేశ్వరుడి కొలువైవున్న కాళహస్తిలో సింగర్ మంగ్లీ బృందం శివరాత్రి పాట చిత్రీకరించారు. శివరాత్రికి పది రోజుల ముందు పాట షూట్ చేశారు. పాట చిత్రీకరణలో శ్రీకాళహస్తి ఆలయ ప్రధాన అర్చకులు అర్ధగిరిస్వామి, మిగిలిన స్వాములు కూడా ఉన్నారు. అసలు ఆలయంలోకి ఎటువంటి ఎల్రక్టానిక్ పరికరాలు, కెమెరాలు, సెల్ ఫోన్లు తీసుకు వెళ్లకూడదని నిషేధం ఉన్నా మంగ్లీ బృందం ఏ విధంగా ఆలయంలో పాటను చిత్రీకరించారని భక్తులు ప్రశ్నించారు.

# భారీగా పెరిగిన యూజర్ చార్జీలు

నెల్లూరు, ఏప్రిల్ 27, ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో యూజర్ ఛార్జీలను పెంచారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మార్కెట్ విలువ సూచించే డాక్యుమెంట్‌కు రూ.10 నుంచి రూ.50కి పెరిగింది. ఈసీకి నుంచి రూ.100 ఛార్జీ వసూలు చేస్తారు. ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ జారీకి రూ.10 నుంచి వందకు పెంచారు. అలాగే సేల్ డీడ్‌లు, వీలునామా, గిఫ్ట్‌డీడ్, పవర్ ఆఫ్ అటార్నీలు రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి డాక్యుమెంట్‌కూ రూ.500 యూజర్ ఛార్జీ విధిస్తారు. అంతేకాదు రూ.లక్ష లోపు విలువ ఉన్న ఆస్తికి స్టాంపులు ఇక నుంచి రూ.50కి పెంచారు. లక్ష దాటితే రూ.100 స్టాంపులను వినియోగించాలి. అలాగే వాణిజ్య సంస్థ, బైలా సొసైటీల రిజిస్ట్రేషన్ ధ్రువపత్రానికి రూ.100 యూజర్ ఛార్జీ వసూలు చేయనున్నారు. రిజిస్ట్రేషన్ చేయదలిచిన దస్తావేజులు పది దాటితే ఒక్కొక్క పేజీకి ప్రస్తుతం తీసుకునే రూ.5ను రూ.10గా పెంచారు. కార్డ్ (కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్) కింద అందించే సేవల్లో భాగంగా హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్ ఎక్విప్‌మెంట్, పవర్ బ్యాకప్, విద్యుత్తు బిల్లు, ఇతర అవసరాలకు ఖర్చులు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పెంపు వెంటనే అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. మార్కెట్ విలువ ప్రకారం ధ్రుపత్రం జారీకి గతంలో రూ.10 ఉంటే ఇప్పుడు రూ.50కి పెరిగింది. ఈసీ సర్టిఫికేట్ యూజర్ ఛార్జీ గతంలో రూ.10. ఉంటే.. ఇప్పుడు రూ.100కు పెరిగింది. సర్టిఫైడ్ కాపీ గతంలో రూ.20 ఉంటే.. ఇప్పుడు రూ.100కు పెరిగింది. ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ఛార్జీ రూ.100 నుంచి రూ.200 వరకు ఉంటే ఇప్పుడు రూ.500కు పెరిగింది. రిజిస్ట్రేషన్ చేయదల్చిన పేజీలు పది దాటితే ఒక్కో పేజీకి గతంలో రూ.5 ఉంటే.. ఇప్పుడు రూ.10కి పెంచారు. రూ.5వేలలోపు స్టాంపులు కొనుగోలు చేస్తే గతంలో రూ.10 ఉంటే ఇప్పుడు రూ.50కు పెరిగింది. అలాగే రూ.5వేల కంటే స్టాంపులు కొనుగోలు చేస్తే రూ.20 ఉండేది.. ఇప్పుడు రూ.100 చేశారు. రూ.10వేల నుంచి 99,999 మధ్యన కొనుగోలు చేస్తే రూ.10 ఉండేది.. ఇప్పుడు రూ.50కు పెంచారు. రూ. లక్ష కంటే ఎక్కువగా కొనుగోలు చేస్తే రూ.20 ఉండేది.. ఇప్పుడు రూ.100కు పెంచారు. సర్టిఫైడ్ ఫర్మ రిజిస్ట్రేషన్ రూ.50 నుంచి రూ.100కు పెరిగింది. రిజిస్టర్డ్ సొసైటీ సర్టిఫైడ్ కాపీ రూ.50 నుంచి రూ.100కు పెరిగింది. ఈ పెంచిన ధరలు వెంటనే అమల్లోకి వచ్చాయని రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్ శాఖ తెలిపింది.

# కడపలో సునీత పోస్టర్ల కలకలం

కడప, ఏప్రిల్ 27, కడపలో వైఎస్ సునీత పోస్టర్లు కలకలం రేపాయి. వివేకా కుమార్తె సునీతా రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారంటూ ప్రొద్దుటూరులో పోస్టర్లు అంటించారు. రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్న మాజీ మంత్రి వివేకానందరెడ్డి కుమార్తె సునీతకు స్వాగతం పలుకుతున్నామంటూ వైయస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో మంగళవారం తెల్లవారుజామున ప్రత్యక్షమైన గోడపత్రాలు కలకలం రేపాయి. వీటిని ఎవరు అంటించారనే వివరాలు అందులో లేకపోవడంతో రకరకాల అనుమానాలు వ్యక్తం అయ్యాయి. గోడలకు అంటించిన పోస్టర్లలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో పాటు సీనియర్ నేతలు అచ్చెన్నాయుడు, లోకేశ్, శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి సహా మాజీ మంత్రి వివేకానందరెడ్డి, సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి చిత్రాలు ముద్రించి పలుచోట్ల అంటించారు. తండ్రి హత్య కేసులో నిందితులకు శిక్ష పడాలని పోరాడుతున్న సునీత తెదేపాలో చేరుతున్నారని ప్రచారం గత కొన్ని రోజులుగా జరుగుతోంది. వివేకా హత్య కేసు దర్యాప్తులో సునీతకు టీడీపీ నుంచి నైతికంగా మద్దతు ఇస్తున్నట్లు ప్రచారంలో ఉంది. వివేకా హత్య తర్వాత సునీతా రెడ్డి తన కుటుంబ సభ్యుల పాత్రపై అనుమానాలు వ్యక్తం చేసిన తర్వాత పరిణామాలు మారిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం విచారణకు సహకరించకపోవడంతో సిబిఐ దర్యాప్తు కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరోవైపు సిబిఐ దర్యాప్తుకు రకరకాల అటంకాలు ఎదురవుతున్న నేపథ్యంలో సునీత కూడా ఎక్కడ వెనక్కి తగ్గకుండా హైకోర్టు, సుప్రీం కోర్టులలో న్యాయపోరాటం చేస్తున్నారు. సునీత తరపున లీగల్ ఫైట్ కారణంగానే సిబిఐ దర్యాప్తులో వేగం పెరిగింది. కేసును నీరుగార్చేందుకు రకరకాల ప్రయత్నాలు జరుగుతున్నా వాటిని ఎప్పటికప్పుడు సునీత అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో సునీత టీడీపీలో చేరుతున్నారంటూ కడపలో పోస్టర్లు అంటించడం ఎవరి పని అనే చర్చ మొదలైంది. సునీత రాజకీయాల్లోకి వస్తారని గత కొద్ది నెలలుగా విస్తృత ప్రచారం జరుగుతోంది. మరోవైపు ప్రొద్దుటూరులో అంటించిన వాల్ పోస్టర్లతో టీడీపీకు సంబంధం లేదని పార్టీ పొలిట్‌బ్యూరో

సభ్యుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివేకా హత్య కేసు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వైసీపీ పోస్టర్ల ప్రచారానికి దిగి ఉంటుందని ఆరోపించారు. మరోవైపు పోస్టర్ల వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి స్పందించాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. సునీతపై దురాలోచనతో గోడపత్రాలు అంటించడం దారుణమని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరోపించారు. కడపలో పోస్టర్లు అంటించడానికి కారణమై?న బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అదనపు ఎస్పీ ప్రేరణకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఇద్దరు వ్యక్తులు ఆటోలో వచ్చి గోడపత్రాలు అంటించిన దృశ్యాలు సీసీ టీవీ ఫుటేజీల్లో నిక్షిప్తమైనట్లు గుర్తించిన పోలీసులు వారు ఎవరన్నది ఆరా తీస్తున్నారు. నిందితులను గుర్తించి విచారించే ప్రయత్నంచ ?స్తున్నారు.

# మే 1నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

విజయవాడ,ఏప్రిల్27 : ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలలకు వేసవి సెలవులుప్రకటించారు. అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలకు మే 1 నుంచి వేసవి సెలవులు ప్రకటిస్తూ పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఏప్రిల్ 30న ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు అయింది. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయి. అయితే పాఠశాలలకు మొత్తం 43 రోజులు వేసవి సెలవులు ఇచ్చారు.

# నెల్లిమర్లలో బొత్సకు ఇంటి పోరు

విజయనగరం, ఏప్రిల్ 27 విజయనగరం జిల్లా పేరు చెబితే తక్కున గుర్తుకొచ్చే నేతలలో బొత్స సత్యనారాయణ ఒకరు. రాజకీయ నేపథ్యం ఏ మాత్రం లేని కుటుంబం నుంచి వచ్చిన బొత్స.. అంచెలంచెలుగా ఎదిగి, జిల్లా రాజకీయాలనే శాసించగల స్థాయికి చేరుకున్నారు. కాపు సామాజిక వర్గంలో బలమైన నేతగా గుర్తింపు పొందిన ఆయనకు పార్టీలకు అతీతంగా మంచి పేరు ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే మంత్రిగా పని చేశారు. పీసీసీ అధ్యక్షుడిగానూ ఎదిగారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి మరణం తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో ఒకానొక దశలో ఆయన ముఖ్యమంత్రి అవుతారని కూడా అంతా భావించారు. అయితే, ఆ అవకాశం త్రుటిలో చేజారింది. బొత్స సమైక్యాంధ్ర ఉద్యమం సమయంలో కాస్త గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఆయన పనైపోయిందనే అంతా భావించారు. కానీ, పడి లేచిన కెరటంలా దూసుకొచ్చారు. వైఎస్ఆర్ సీపీలో చేరారు. ఆ పార్టీ అధికారంలోకి రావడంతోనే జిల్లా నుంచి ఏకైక మంత్రిగా పురపాలక పట్టణాభివృద్ధి శాఖ బాధ్యతలు స్వీకరించారు. కోల్పోయిన వైభవం తిరిగి సాధించడంలో ఆయన మేనల్లుడు, ప్రస్తుత జిల్లా పరిషత్తు ఛైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అయిన మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) పాత్రను కొట్టిపారేయలేం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచీ మంత్రిగా బొత్స ఉన్నా.. జిల్లా రాజకీయాలను ప్రభావితం చేసింది చిన్న శ్రీను అనే చెప్పవచ్చు. ఒక విధంగా చెప్పాలంటే బొత్సకు కుడి భుజంగా ఉన్నారు. ఇన్నాళ్లూ



తెరవెనుక రాజకీయాలు నడిపిన శ్రీను.. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి, జడ్పీ ఛైర్మన్‌గా పదవి చేపట్టిన తర్వాత.. బొత్సకు దూరమయ్యారని ప్రచారం జరుగుతోంది. పేరుకు మంత్రి బొత్స అయినా.. జిల్లాలో పెత్తనమంతా చిన్నశ్రీనుదే. అటు రాజకీయాలు, ఇటు అధికార యంత్రాంగాన్ని శాసించడంలో ఆయనదే కీలక పాత్ర. చాలా వరకూ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆయననే ఫాలో అవుతున్నారు. ఒకనొక దశలో మంత్రిని పూర్తిగా పక్కనపెట్టేశారన్న ప్రచారం నడిచింది. సత్తిబాబు కంటే చిన్నశ్రీను దగ్గరికి వెళ్తేనే పని అవుతుందన్న నమ్మకం అందరిలోనూ పెరిగింది. ఈ పరిణామాలు బొత్స సత్యనారాయణకు మింగుడుపడలేదు. బొత్సతో పొసగని నేతలను చిన్నశ్రీను చేరదీస్తున్నారు. తనకంటూ ఓ వర్గాన్ని సృష్టించుకుంటున్నారు. మంత్రి బొత్సకు వరసకు మేనల్లుడు అయ్యే బడ్డుకొండ అప్పలనాయుడు నెల్లిమర్ల ఎమ్మెల్యేగా ఉన్నారు. అక్కడ బొత్స సొంత తమ్ముడు లక్ష్మణరావు.. ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా వర్గం నడుపుతున్నారు. స్థానిక ఎన్నికల సమయంలో పూసపాటిరేగలో ఈ ఇద్దరి మధ్య బహిరంగంగానే వాగ్వాదం జరిగింది. లక్ష్మణరావు తనను ఇబ్బంది పెడుతున్నారని బడ్డుకొండ అప్పలనాయుడు అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో నెల్లిమర్ల నుంచి తాను పోటీ చేయడం గానీ, తన కొడుకును గానీ పోటీలో ఉంచాలని బొత్స లక్ష్మణరావు భావించారు. అందులో భాగంగా కొన్నాళ్లు దూకుడుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే అప్పలనాయుడికి వ్యతిరేకంగా శిబిరం నడిపారు. లక్ష్మణరావును అదుపు చేయాలని అప్పలనాయుడు అప్పట్లో బొత్సను కూడా కోరారు. తర్వాత లక్ష్మణరావు స్పీడు తగ్గినా... నెల్లిమర్ల నియోజకవర్గంలో బొత్స వర్సెస్ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నట్టుగా పరిస్థితి మారింది. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకి చిన్న శ్రీను బావ అవుతారు. ఇప్పుడు ఆ బంధం కాస్త వియ్యంకులుగా మారింది. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో బొత్స - చిన్నశ్రీనులు ఎడమొహం పెడమొహంగా ఉంటున్నారని ఆ పార్టీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ప్రత్యేక సందర్భంలో తప్పితే.. ఇద్దరూ కలసి కార్యక్రమాల్లో పాల్గొంటున్నది లేదు. ఇటీవల జరిగిన చిన్నశ్రీను కుమార్తె వివాహంలోనూ బొత్స కనిపించలేదు. ఇద్దరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయన్న టాక్ జిల్లాలో నడుస్తోంది. ఇద్దరూ విడిపోతే పార్టీకే నష్టమని శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. కేడర్లో బలమైన ముద్ర వేసుకున్న చిన్న శ్రీనును కాదని బొత్స సత్తిబాబు ఏమి చేసే పరిస్థితి లేదు. అలాగని బొత్స సత్తిబాబుకు దూరమై రాజకీయాలు చేసే పరిస్థితి చిన్న శ్రీనుకు ఉండదని పలువురు నాయకులు అభిప్రాయపడుతున్నారు. అసలు వీరి మధ్య వివాదానికి కారణమేమిటన్న విషయంపైనా ఎక్కడా స్పష్టత లేదు. అసలు వివాదం ఉందా, లేదా అన్నది కూడా తెలియదు. ప్రస్తుతం మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను) విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగానూ ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన అసెంబ్లీ బరిలో దిగాలని ఆలోచిస్తున్నారు. అందుకనుగుణంగా ముందుకు సాగుతున్నారు. జిల్లాలోని ఎస్.కోట, చీపురుపల్లి, శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల నుంచి పోటీ చేసే ఆలోచనలో శ్రీనివాసరావు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతానికైతే చీపురుపల్లి నియోజకవర్గంలోనే ఎక్కువగా పర్యటిస్తున్నారు. అయితే, ప్రస్తుతం ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే బొత్స కావడం విశేషం. వచ్చే ఎన్నికల సమయానికి బొత్సను రాజ్యసభకు పంపుతారన్న ప్రచారం ఉంది. ఇదే సమయంలో బొత్స కుమారుడు సందీప్ ను ఈ నియోజకవర్గం నుంచి బరిలోకి దించే అవకాశాలూ లేకపోలేదు. ఏదేమైనప్పటికీ.. చిన్న శ్రీను సైలెంట్‌గా తన పని తాను చేసుకుపోతున్నారు. ఇదే సందర్భంలో మిగిలిన నియోజకవర్గాలపైనా తనదైన శైలిలో రాజకీయ చతురతను కనబరుస్తూ దూకుడుగా వెళ్తున్నారు. ఎన్నో ఏళ్లుగా రాష్ట్ర రాజకీయాల్లోనే కీలకంగా ఉన్న బొత్సకు.. ఇప్పుడు సొంత కుటుంబంలోని పరిణామాలు తలనొప్పిగా మారాయి.

# 28 తర్వాత ప్రభుత్వంపై పోరాటమే

విజయవాడ, ఏప్రిల్ 27, రాష్ట్ర ఆదాయం మొత్తం ఉద్యోగుల జీతాలకే సరిపోతోందన్న ప్రభుత్వ వాదనపై ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్త చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆదాయం లక్ష కోట్ల రూపాయలు అయితే ఉద్యోగులకే రూ. 90 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పడం దారుణమని బొప్పరాజు వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం ఆయన కాకినాడ లో ఉద్యోగులు నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్నారు. వాలంటీర్ల జీతాలతో పాటు ఏపీ ఉద్యోగులకు చెల్లించే మొత్తం రూ.60 వేల కోట్లకు మించి ఉండదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ఉద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉద్యోగులందరూ నిర్లక్ష్యం వహించకుండా ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమంలో పాలుపంచు కోవాలని బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపిచ్చారు. ఉద్యమించకుంటే ప్రతి ఉద్యోగి తగిన మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే జీతాలు సరైన సమయానికి పడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈనెల 28న రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం విజయవాడలో నిర్వహిస్తున్నామని, అందరూ హాజరు కావాలని కోరారు. ఇతర ఉద్యోగ సంఘాలు కలిసి రాకపోయినా బొప్పరాజు మాత్రం పూర్తి స్థాయిలో పోరాటం చేస్తున్నారు. ఉద్యోగుల మలిదశ ఉద్యమం ఓర్పుతో సాగుతోందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి చాలా సమయం ఇచ్చామని స్పష్టం చేశారు. ఉద్యమం తీవ్రమైతే తాము బాధ్యులం కాదని అన్నారు. డిమాండ్ల పరిష్కారానికి 47 రోజులుగా నిరసనలు తెలుపుతున్నామని బొప్పరాజు వివరించారు. రెండుసార్లు మంత్రివర్గ ఉపసంఘంతో భేటీ అయ్యామని, కానీ సమావేశాలతో ఎలాంటి పరిష్కారం లభించలేదని తెలిపారు. ఉద్యమ నేపథ్యంలో, ఈ నెల 28న ఏపీ ఎన్జీవోలు, ట్రేడ్ యూనియన్లతో సమావేశం అవుతున్నట్లు బొప్పరాజు వెల్లడించారు. పీఆర్సీ, డీఏ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని, పాత బకాయిలు ఎన్నేళ్లకు ఇస్తారో తెలియడంలేదని బొప్పరాజు వాపోతున్నారుఈ నెల 28 నుంచి కార్మిక, టీచర్స్, సంఘాలతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నామని బొప్పరాజు చెబుతున్నారు. తాము చాలా ఓపికతో సహనంతో ఉద్యమాన్ని చేస్తున్నామన్నారు. తెలంగాణాలో ఒక్క డీఏ పెండింగ్‌లో లేదని, కానీ ఏపీ లో ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి డీఏ ఊసే లేదన్నారు. సీపీఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర అంశాలపై సమస్యలు పెంచే కొద్ది పెరుగుతూనే ఉంటాయని పరిష్కారం కావాలని ఆనయంటున్నారు.

# సైకిల్ ఎక్కనున్న శైలజానాథ్



అనంతపురం, ఏప్రిల్ 27 అనంతపురం జిల్లాలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. మాజీ మంత్రి టీడీపీలో వస్తారంటూ సరికొత్త ప్రచారం మొదలైంది. మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఇంటికి వెళ్లడం చర్చనీయాంశమైంది. జేసీ దివాకర్ రెడ్డి దాదాపు గంటపాటు శైలజానాథ్‌తో చర్చలు జరిపారు. శైలజానాథ్ ఆహ్వానం మేరకే జేసీ ఆయన నివాసానికి వెళ్లారని చెబుతున్నారు. శైలజానాథ్ టీడీపీలోకి వస్తారని స్థానికంగా చర్చ జరుగుతోంది. జేసీ, శైలజానాథ్‌లు మాత్రం ఎలాంటి కామెంట్స్ చేయలేదు. సాకే శైలజానాథ్ మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఆయన శింగనమల నియోజకవర్గం నుంచి 2004, 2009లో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత ప్రాథమిక విద్యాశాఖ, పాఠ్యపుస్తకాలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. శైలజానాథ్ 2022 జనవరి నుంచి 2022 నవంబర్ వరకు ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్‌గా పనిచేశారు. జేసీ దివాకర్ రెడ్డి, సాకే శైలజానాథ్‌లు గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు. 2014 ఎన్నికల సమయంలో జేసీ బ్రదర్స్ టీడీపీలో చేరగా.. శైలజానాథ్ మాత్రం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. ఇదిలా ఉంటే మాజీ మంత్రి రఘువీరా రెడ్డి కూడా మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నారు. ఇప్పటికే కర్ణాటక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి తాను రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుందామని భావించానని.. కానీ తాజా పరిణామాలతో తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు చెప్పారు. అందుకే రాజకీయాల నుంచి తప్పుకోవడం భావ్యమా అని ఆలోచించినట్లు చెప్పారు. అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రఘువీరారెడ్డి కూడా మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మడకశిర నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగింది.. దీంతో ఆయన నియోజకవర్గం మారారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. అలాగే వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో రఘువీరారెడ్డి వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా పనిచేసి కొణిజేటి రోశయ్య ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన సంగతి తెలిసిందే. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలోనూ మంత్రిగా పనిచేశారు. విభజన తర్వాత ఏపీకి పీసీసీ ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు. కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇటీవలే రాయలసీమ నేతలంతా సమావేశమయ్యారు.. అక్కడ కూడా జేసీ, శైలజానాథ్ మాట్లాడుకుంటూ కనిపించారు. అంతేకాదు రాయలసీమను తెలంగాణ పేరుతో జేసీ దివాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాయల తెలంగాణ ఏర్పాటు చేయాలని.. అప్పుడే రాయలసీమ సాగునీటి సమస్య తీరుతుందని వ్యాఖ్యానించారు. ప్రత్యేక రాయలసీమ వచ్చినా సంతోషమేనని.. అలాగే రాయల తెలంగాణ అయినా ఫర్వాలేదన్నారు. ఈ రాయల తెలంగాణ నినాదానికి తనవంతుగా మద్దతు కూడగడతానని కామెంట్ చేశారు. తెలంగాణలో రాయలసీమను కలుపుకోవాల్సిన అవసరం సీఎం కేసీఆర్‌కు ఉందన్నారు.

# పవన్ లేఖకు అర్ధం ఏమిటీ...

ఏలూరు, ఏప్రిల్ 27, జనసేన కార్యకర్తలను ఉద్దేశించి పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తాజాగా బహిరంగ లేఖ రాశారు. అందులో పార్టీ విధానాలు.. కార్యకర్తలు, నేతలు వ్యవహరించాల్సిన తీరు.. ఎలా స్పందించాలన్న అంశాలను వివరించారు. తాను చెప్పిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కూడా సూచించారు. అంత వరకు బాగానే ఉన్నా? పవన్ చేసిన సూచనలే ఇప్పుడు చర్చకు దారి తీస్తున్నాయట. జనసేనకు ఉన్న క్రెడిబిలిటీని దృష్టిలో పెట్టుకుని చాలా మంది వివిధ అంశాలను పార్టీ నేతల దృష్టికి తెస్తున్నారని.. ఆర్థిక నేరాలపై స్పందించేటప్పుడు వాటిని పూర్తి స్థాయిలో నిర్ధారణ చేసుకుని.. అలాగే డాక్యుమెంట్ సహా సాక్ష్యాధారాలు ఉంటేనే మాట్లాడాలని సూచించారు. అది కూడా ముందు పార్టీ అధినాయకత్వం దృష్టికి తేవాలని స్పష్టం చేశారు. అలాగే విమర్శలు చేసే సందర్భంలో ప్రత్యర్థి పార్టీకి చెందిన నేతల కుటుంబ సభ్యుల పేర్లను ప్రస్తావించవద్దని ఆదేశించారు. మరీ ముఖ్యంగా పొత్తుల విషయమై మాట్లాడేటప్పుడు.. స్పందించే సందర్భంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పుడు ఇవే అంశాలపై పార్టీ కేడర్ ఆసక్తికర చర్చ జరుగుతోందట. సరైన పత్రాలు లేకుండా ఎవరిపైనా ఆర్థిక నేరారోపణలు చేయొద్దని ఎందుకన్నారనేది ఓ ప్రశ్న. ఇది మంచి విధానమే అయినా.. రాజకీయ పార్టీగా ఆచరణలో ఎంత వరకు ఇది సాధ్యమనే ప్రశ్న వస్తోందట పార్టీ నాయకులకు. ప్రస్తుతం ఉన్న పోటీ రాజకీయాల్లో ఈ విధంగా ఉండడం సాధ్యమయ్యే పనేనా అనే చర్చ జరుగుతోందట. జనసేనకు ఉన్న క్రేజ్ ను ఎవరైనా నేతలు.. తమ వ్యక్తిగత లబ్ధి కోసం వాడుకుంటున్నారనే సమాచారంతో దానికి చెక్ చెప్పడానికే పవన్ ఈ తరహా సూచన చేశారా..? అన్న అనుమానాలు కూడా వస్తున్నాయట. ఇక ఇదే సందర్భంలో పవన్ కేసులకు భయపడుతున్నారా..? అనవసరంగా కేసులు పెట్టించుకుని ఇబ్బందులు పడటం ఎందుకనుకుంటున్నారా? లేక రాద్ధాంతం ఎందుకని భావిస్తున్నారా..? అనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో జరుగుతోందట. సాధ్యాసాధ్యాల మాట ఎలా ఉన్నా? ఈ స్టాండ్ మీద నిలబడిగలిగితే మాత్రం ప్రస్తుత రాజకీయాల్లో పవన్‌కళ్యాణ్ ట్రెండ్ సెట్ చేస్తారనే చెప్పొచ్చంటున్నారు. మరోవైపు పొత్తుల గురించి సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని.. ఆధారం చేసుకుని మాట్లాడొద్దని.. తమతో సయోధ్యగా ఉన్న రాజకీయ పార్టీల్లోని చిన్న చితక నేతలు ఏమైనా విమర్శలు చేసినా.. దాన్ని లైట్ తీసుకోవాలని.. ఆయా పార్టీల విధానాలుగా భావించొద్దని.. స్పష్టం చేశారు జనసేనాని. ఇప్పుడిదే చర్చనీయాంశం అయింది. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలు బీజేపీని ఉద్దేశించినవా..? లేక టీడీపీని ఉద్దేశించి చేశారా..? అనే చర్చ మొదలైంది. ప్రస్తుతానికి టీడీపీ, బీజేపీల్లోని నేతలు ఎవరూ పవన్ ఉద్దేశించి ఎలాంటి నెగెటివ్ కామెంట్లు చేయడంలేదు. కానీ.. టీడీపీ-జనసేన పొత్తు దాదాపు ఖరారు అయిందని.. ఇక సీట్ల పంపకమే తరువాయన్న ప్రచారం నిజమేనన్న అభిప్రాయం పవన్ లేఖ ద్వారా స్పష్టం అవుతోందంటున్నారు. వ్యతిరేక కామెంట్స్ చేయవద్దని కేడర్‌కి సూచించింది కూడా టీడీపీ విషయంలోనే అనే అభిప్రాయం కూడా ఉందట. సీట్ల పంపకంలో భాగంగా తమకు అవకాశంరాని నేతలు అసంతృప్తిగా ఉంటారు.. వారు ఆ సందర్భంలో మీడియాతో మాట్లాడుతూ ఏదోఒక వ్యతిరేక వ్యాఖ్య చేస్తారని, అందుకే ముందు జాగ్రత్తగా పవన్ ఇలా సూచనలిచ్చారన్న మరో వాదన కూడా ఉంది. నేతలు చేసే కామెంట్ల ప్రభావం పొత్తులపై పడకుండా.. ఓట్ షేరింగ్‌లో ఇబ్బందులు రాకుండా జాగ్రత్త పడటంలో ఇది తొలి అంకంగా భావిస్తున్నారట. ఇదే సందర్భంలో టీడీపీ-జనసేన మధ్య గ్యాప్ పెంచేలా సోషల్ మీడియాలో జరిగే ప్రచారంతో జనసేన కార్యకర్తలు ఆవేశంతో ఊగిపోతే.. అది మరింత నష్టం కలిగిస్తుందని, అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే పవన్ ఈ తరహా జాగ్రత్తలు తీసుకుంటున్నారనేది పొలిటికల్ సర్కిల్సులో వినిపిస్తున్న మాట. మొత్తంగా ఎన్నికలు దగ్గరపడుతున్న టైంలో తన పార్టీ కార్యకర్తలకు పవన్ చేసిన ఈ సూచనలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. నిజంగానే వీటిని ఆచరణలో పెట్టగలిగితే మాత్రం ఇవాళ్టి రాజకీయ పరిస్థితుల్లో ట్రెండ్ సెట్టర్స్ అవుతారంటున్నారు విశ్లేషకులు.

# అందరివాడు చిక్కాల



కాకినాడ కుల,మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా మెలిగే ప్రజా సేవకుడు చిక్కాల రామచంద్రరావు అని మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీగా పదవీ విరమణ చేయనున్న చిక్కాల రామచంద్రరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అడుగడుగునా ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టడంతో ఐదుసార్లు తాళరేవు శాసనసభ్యునిగా, రెండుసార్లు మంత్రిగా పనిచేశారని అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఏదో చేయాలనే తపనతో పనిచేసిన నిరాడంబర రాజకీయ నేత చిక్కాల అని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ సమకాలీన రాజకీయ నాయకులలో చిక్కాలది ఒక ప్రత్యేక స్థానమని అన్నారు. మంత్రిగా పనిచేసినా ఎప్పుడూ నిరాడంబరంగా ప్రజలకు అందుబాటులో ఉండే వారని అన్నారు. విలువలతో కూడిన రాజకీయ నేతగా ఆయన పని చేస్తున్నారని అడబాల కొనియాడారు. చిక్కాల మాట్లాడుతూ కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు త్రికరణ శుద్ధిగా ప్రజలకు సేవ చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్ పట్నాయక్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, ఓం నమశ్శివాయ , డాక్టర్ శిరీష, అడబాల సత్యనారాయణ, పార్థసారథి ,రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# రసవత్తరంగా మారిన కాకినాడ రాజకీయం

కాకినాడ, ఏప్రిల్ 27, కాకినాడ పార్లమెంటు నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారింది. ముఖ్యంగా టీడీపీ నుంచి సీటు ఎవరిని వరిస్తుందోననే సస్పెన్స్ నెలకొంది. ఆశావహులు పెరుగుతుండడంతో టీడీపీ టికెట్ కు డిమాండ్ ఏర్పడింది. తాజాగా కాకినాడ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ రంగంలోకి దిగారు. మొన్న అన్నవరం సత్యనారాయణ స్వామి సన్నిధిలో పూజలు జరుపుకొని అనంతరం జిల్లా పెద్దలను కలిసే పనిలో పడ్డారు. తన అభ్యర్థిత్వాన్ని సహకరించాలని ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ పెద్దలు, సీనియర్ కార్యకర్తల ఆశీస్సులు తీసుకుంటున్నారు. ప్రతి గ్రామంలోనూ నవీన్ కు విశేష ఆదరణ దక్కుతోంది. దీంతో కాకినాడ పార్లమెంటులో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఎన్నికల ప్రచారం తలపించే రీతిలో గ్రామగ్రామాన పచ్చ జెండాలు రెపరెపలాడుతున్నాయి. దీంతో వైసీపీలో గుబులు రేగుతోంది. రాజకీయ నేపథ్యం గల కుటుంబం నుంచి వచ్చిన జ్యోతుల నవీన్ కుమార్ కాకినాడ జిల్లాలో మంచి ఫాలోయింగ్ ఉందనే చెప్పాలి. జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో నవీన్ కు బంధు వర్గం ఉంది. కాపు సామాజిక వర్గంలోనూ బంధువులు ఉండటంతోపాటు మిగిలిన సామాజిక వర్గాల్లో మిత్రులు కూడా ఉన్నారు. నవీన్ తండ్రి జ్యోతుల నెహ్రూ సీనియర్ రాజకీయ వేత్త కావడం, దీనికి తోడు అతను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంచి సంబంధాలు కలిగి ఉండటం ఆయనకు కలిసొచ్చే అంశంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. గతంలో నవీన్ జగ్గంపేట నియోజకవర్గంలో పాదయాత్ర చేసి జనంలో ముద్ర వేసుకొన్నారు. తాజాగా అభ్యర్థిత్వం కోసం ప్రతి సీనియర్ కార్యకర్త, పార్టీ నాయకులు ఇంటికి వెళ్లి సహకరించాలని కోరుతున్నారు. ఇందులో భాగంగా ఏడు నియోజకవర్గాల్లోనూ విస్తృతంగా పర్యటిస్తున్నారు. నవీన్ ఇటీవలే పార్టీ యువనేత నారా లోకేష్ ను కలిసి కొన్ని రోజులపాటు యువగళం పాదయాత్రలో పాల్గొన్నారు. అధికార వైసీపీలో పార్టీలో గందరగోళం నెలకొంది.

వాస్తవానికి ఇక్కడ సిట్టింగ్ ఎంపీ వంగా గీత ఉన్నా, పిఠాపురం అసెంబ్లీ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు గతంలో ప్రచారం జరిగింది. అయితే అక్కడి సీటు సిట్టింగ్ శాసన సభ్యుడు పెండెం దొరబాబుకు ప్రకటించారు. దీంతో గీతకు పిఠాపురం నో చాన్స్ అని చెప్పాలి. అయితే గీత మళ్లీ కాకినాడ పార్లమెంటు సీటునకు పోటీ చేస్తారా లేక ఏదైనా అసెంబ్లీకి పోటీ చేస్తారా అనేది స్పష్టత లేదు. అయితే ఈ సారి కాకినాడ పార్లమెంటుకు రూరల్ శాసన సభ్యుడు కన్నబాబు పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీ కాకినాడ పార్లమెంటు అభ్యర్థిత్వం పట్ల గందరగోళంలో నెలకొంది. అయితే భవిష్యత్తు పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

# టీడీపీ, బీజేపి పొత్తులు..

**చర్చోపచర్చలు**

విజయవాడ, ఏప్రిల్ 27, ఏపీలో ఇప్పుడు రాజకీయ పొత్తులపై చర్చ జరుగుతోంది. ఓ ఇంగ్లిష్ టీవీ చానల్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు మోదీ విధానాలను సమర్థిస్తానని ప్రకటించారు. అయితే కలిసి పని చేస్తారా అన్న దానిపై కాలం నిర్ణయిస్తుందన్నారు. అంతే ఏపీలో మళ్లీ 2014 కూటమి ఖాయమన్న ప్రచారం ఊపందుకుంది. అయితే పొత్తుల వల్ల ఎవరికీ లాభం ఉండదని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. పొత్తుల వల్ల ఎవరికి ఎక్కువ లాభం అనే చర్చ ఇప్పుడు రాజకీయాల్లో జోరుగా సాగుతోంది. దేశం మొత్తం మీద బీజేపీ అత్యంత బలహీనంగా ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. నోటా కంటే తక్కువ ఓట్లు గత ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చాయి. ఆ పార్టీతో పొత్తు వల్ల టీడీపీకి ఓట్ల పరంగా కలసి వచ్చే అవకాశం లేదు. కానీ పొత్తు అంటే పెట్టుకుంటే.. టీడీపీ నష్టపోయే అవకాశాలు ఉన్నాయి. బీజేపీ పొత్తును వ్యతిరేకించే వర్గాలు ఆ పార్టీకి దూరమవుతాయి. అదే సమయంలో అర శాతం బీజేపీ ఓటర్లు కూడా టీడీపీ తో పొత్తు పెట్టుకున్నాం కదా అని టీడీపీకి ఓట్లు వేయరనే అంచనా ఉంది. టీడీపీని సంస్థాగతంగా వ్యతిరేకిస్తారు ఆ పార్టీ ఓటర్లు. అయితే జనసేన పార్టీతో మాత్రం పొత్తు కోరుకుంటున్నారు టీడీపీ నేతలు. ఆ పార్టీకి ఆరు శాతం వరకూ ఓటు బ్యాంక్ ఉంది. ఆ ఓట్లు గేమ్ ఛేంజర్ అని గట్టిగా నమ్ముతున్నారు. అందుకే ఆ పార్టీతో కలవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఏపీలో వచ్చే ఎన్నికలు ఫ్రీ అండ్ ఫెయిర్‌గా జరగవని టీడీపీ నేతలు గట్టిగా నమ్ముతున్నారు. వ్యవస్థల్ని అదుపులో పెట్టుకున్న జగన్మోహన్ రెడ్డి అరాచకాలకు పాల్పడతారని నమ్ముతున్నారు. అలాంటి పరిస్థితి రాకుండా ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలు జరగాలంటే కేంద్రం మద్దతు ఉండాలని భావిస్తున్నారు. బీజేపీ తమకు మద్దతుగా ఉండకపోయినా... వైసీపీకి సపోర్ట్ గా ఉండవద్దని కనీసం న్యూట్రల్ గా అయినా ఉండాలని చంద్రబాబు కోరుకుంటున్నారు. అందుకే తాము హితులమే అని చెప్పడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కలుస్తాయో లేదో కానీ టీడీపీ, బీజేపీ కలిసినప్పుడు మంచి ఫలితాలు వచ్చాయి. 2014లో బీజేపీతో కలిసి చంద్రబాబు పోటీ చేశారు. విజయం సాధించారు. 2019 ఎన్నికల నాటికి కాంగ్రెస్ తో కలిసి ఘోర పరాజయం పాలయ్యారు. అంతకు ముందు కూడా బీజేపీ, టీడీపీ కూటమిగా మారితే చాలా విజయాలు దక్కాయి. ఇటీవల అండమాన్‌లో మేయర్ పోస్టును పొత్తులో భాగంగా టీడీపీకి కేటాయించి బీజేపీ. అక్కడ టీడీపీకి ఉంది రెండే రెండు సీట్లు. అయినా మేయర్ సీటు ఇచ్చింది. బీజేపీ అధ్యక్షుడు నడ్డా ట్విట్టర్‌లో టీడీపీ, బీజేపీ కూటమికి శుభాకాంక్షలు అని ప్రకటించారు. నమ్మకమైన మిత్రపక్షాలు బీజేపీకి దూరమయ్యారు. బీజేపీ రెండు సార్లు పూర్తి మెజార్టీతో అధికారంలోకి రావడానికి కారణం ఉత్తరాది... హిందీ రాష్ట్రాలు. అక్కడ 95 శాతం సీట్లు సాధించడం ద్వారానే ఢిల్లీ పీఠం దక్కింది. రెండు సార్లు జరిగిన అద్భుతం మూడో సారి జరగకపోతే సీట్ల కోత పడుతుంది. దక్షిణాదిపై ఆ పార్టీకి ఆశలు లేవు. అందుకే ఇప్పుడు బీజేపీకి నమ్మకమైన మిత్రపక్షం కావాలి. వైసీపీ ఎలాగూ కూటమిలో చేరదు. టీడీపీకి కూటమిలో చేరే ఆప్షన్ ఉంది. ఎలా చూసినా రెండు పార్టీలు పొత్తులు పెట్టుకోవడం వల్ల ఇరువురికి వచ్చే లాభం అంటూ ప్రత్యేకంగా ఏమీ ఉండదని అంచనా వేయవచ్చు.

# వైకాపా కార్పోరేటర్ కనపడడంలేదు జనసేన

విజయవాడపవన్ కళ్యాణ్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగక పోరాటం చేస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్తు పై ముందు చూపు ఉన్న వ్యక్తి పవన్ కళ్యాణ్ రు మాత్రమేనని జనసేన నేత పోతిన మహేష్ అన్నారు. గురువారం నిర్వహించిన ఇంటింటికి రాబోయే మన జనసేన ప్రభుత్వం కార్యక్రమంలో అయన పాల్గోన్నారు. 35వ డివిజన్ అధ్యక్షులు నారాయణస్వామి ప్రదీప్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహేష్ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇసుక విధానం వలన రాష్ట్ర భవిష్యత్తు నాశనం అవుతుందని ముందుగా గ్రహించి, ఇసుక పాలసీని వ్యతిరేకించి లాంగ్ మార్చ్ చేసిన ప్రజా నాయకుడు పవన్ కళ్యాణ్. సెంటు భూమి పథకం పేరుతో ప్రజల్ని మోసం చేసిన సీఎం జగన్. మాయ మాటలు చెప్పి ప్రజల్ని మోసం చేయడంలో సీఎం జగన్ దిట్ట. గెలిచిన తర్వాత వైసిపి కార్పొరేటర్ కనపడటం లేదని ప్రజలు ఆవేదనతో వున్నారని అన్నారు.

# గంగమ్మ వైభవాన్ని దేశవ్యాప్తం చేయాలి

**- ఎమ్మెల్యే భూమన**

**గంగమ్మ స్వర కుంభాభిషేకం ఆల్బమ్ ఆవిష్కరణ**

తిరుపతి తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ప్రశస్త్యం దేశమంతా తెలిసేలా అమ్మ జాతరను వైభవంగా నిర్వహిద్దామని తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డి ప్రజలనుద్దేశించి విజ్ఞప్తి చేసారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తల్లిని కొలుస్తూ, అమ్మ వైభవాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెల్లాలనే ఆలోచనలో భాగంగ 7 పాటలను తీసుకురావడం జరిగిందని ఆయన చెబుతూ 7 పాటలతో రూపొందించిన గంగ జాతర స్వర కుంభాభిషేకం సిడిని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి గురువారం స్థానిక భీమాస్ రెసిడెన్సీ హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీ యాదవ్, ఈవో మునికృష్ణలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ దేశంలోనే మొట్ట మొదటి గ్రామ దేవత దేవాలయం మన తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లి ఆలయమని, తిరుపతి గంగమ్మ ఆలయం నుంచే జాన పద పండుగ భావస్ఫూర్తి దేశానికి వ్యాపించిందన్నారు. రాయలసీమకే తిరుపతి గంగ జాతర తలమానికమని వివరిస్తూ గంగమ్మ తల్లి ఆలయ ప్రాశస్త్యం భారత జాతికి తెలియాలన్నారు. ఐదు వందల సంవత్సరాల కిందటి నుంచే తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తన చెల్లి గంగమ్మకు సారె సమర్పించే సంప్రదాయం కొనసాగుతున్నదని, గంగమ్మ దర్శనం తర్వాతే తిరుమల శ్రీవారిని దర్శించుకునే విధానం గతంలో ఉండేదని ఆయన గుర్తు చేసారు. తిరుమల శీవారి దేవేరైన, తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగే పంచమితీర్థం సందర్భంగా అమ్మ వారికి సమర్పించే పసుపు, కుంకుమలను గంగమ్మ తల్లి ఆలయం వద్ద నుంచే తీసుకెళ్లే విధానమూ గతంలో ఉండేదన్నారు. తిరుపతి గంగమ్మ ఆశీస్సులు వల్లే మన ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాలు లేవని, గడిచిన గత వెయ్యేళ్లలోనూ ఇక్కడ కలరా అంటే ఎమిటో తెలియదని, ఇదంతా గంగమ్మ తల్లి కృపేనన్నారు. బ్రహ్మోత్సవాల తరహాలో గంగ జాతరను వైభవంగా జరపాలన్నదే ఇక్కడి 4.5 లక్షల మంది కోరికని, గంగమ్మ వైభవాన్ని దేశవ్యాప్తం చేయడంలో మీడియా సహకారం అవసరమని భూమన ఆకాంక్షించారు. గంగమ్మ స్వర కుంభాభిషేకం ఆల్బమ్ రూపకల్పన వెనుక కమిషనర్ హరిత సోదరుడు కిషన్ కృషి ఉన్నదని, మంగ్లీ దగ్గర పాడించడమే కాకుండా అమ్మవారికి తన గొంతుతో ఒక పాట పాడడం అమ్మవారి దయేనని చెబుతూ కిశన్, వారి బృందంలోని సంపత్, జశ్వంత్ లకు ప్రత్యేక అభినందనలు ఎమ్మెల్యే భూమన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, పాలగిరి ప్రతాప్ రెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, హనుమంత నాయక్, రుద్రరాజు శ్రీదేవి, దేవానంద్, రాజేంద్ర, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఎంపి ని అరెస్టు చేయాలి

విశాఖపట్నం రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బీజేపీ యం.పి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నరసింగ రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఢల్లీ?లోని జంతర్ మంతర్ వద్ద గత ఐదు రోజుల నుండి రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి సంఘీ?భావంగా విశాఖ జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద విశాఖజిల్లా సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్.ఎఫ్.ఐ సంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ కార్యక్రమంలో నరసింగరావు పాల్గొని మాట్లాడుతూ రెజ్లర్ల పై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ యం.పి పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఇంత వరకు ఆయనపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయకపోవడం దురదృష్టకరమన్నా రు. దేశానికి వన్నెతెచ్చిన క్రీడాకారుల పట్ల బిజెపి వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టారు. రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు తమపై అనైతిక చర్యలకు పాల్పడ్డాడని, తమను అగౌరవపరిచే విధంగా వ్యవహరిం చారని రెజ్లర్లు ఫిర్యాదు చేయాల్సిరావడం చాలా ఆందోళకరమైన అంశం. క్రీడాకార్లుపై లైంగిక దాడి చేసిన అధికార పార్టీ ఎంపి, డబ్ల్యు.ఎఫ్.ఐ ఛీఫ్ మోడీ ప్రభుత్వం కాపాడుతోందని దుయ్యబట్టారు.

# వివేకా కేసులో అవినాష్ రెడ్డి సంచలన వీడియో విడుదల

పులివెందుల వివేకా కేసులో అవినాష్ రెడ్డి సంచలన వీడియో విడుదల చేశారు. వివేకా హత్య జరిగిన రోజు ఎం జరిగిందో ప్రజలకు తెలియాలని.. మొదట ఆ రోజు హత్య జరిగిందని శివ ప్రకాష్ రెడ్డి ఫోన్ చేశారని తెలిపారు. 6.30 కు ఫోన్ చేశారు.. అప్పటికే జమ్మలమడుగుకు బయలు దేరాన్నారు. జీకే కొండారెడ్డి పార్టీ లో చేర్చుకునే కార్యక్రమది అని అయన అన్నారు. రింగ్ రోడ్డులో ఉండగా ఫోన్ చేసి అర్జెంట్ గా బావ ఇంటికి వెళ్ళమని చెప్పారు..వివేకా చని పోయారని శివ ప్రకాష్ రెడ్డి చెప్పారన్నారు..అక్కడికి వెళ్లగానే పీఏ కృష్ణారెడ్డి అక్కడ ఉన్నారు..బాత్రూమ్ లో డెడ్ బేడీ ఉందన్నారు.. అనుమానాస్పదంగా ఉమైనా ఉందేమోనని అడిగాను..అవేమీ లేదని చెప్పారని అవినాష్ రెడ్డి సంచలన వీడియో విడుదల చేశారు. వివేక రాసిన లెటరు, ఫోన్ ఉంది? ఆ రెండు ఉన్నట్లు వివేక అల్లుడికి మాత్రమే చెప్పాడు..అవి దాచి పెట్టమని చెప్పాడన్నారు. ఇదంతా సీబీఐ విచారణలో వెల్లడైందని.. వివేక రాసిన లేఖలో డ్రైవర్ ప్రసాద్ ను వదిలిపెట్టవద్దు అని రాశాడని చెప్పారు అవినాష్ రెడ్డి. చివర రాసిన మాటలు..అవి దాచిపెట్టి మని రాజశేఖర్ రెడ్డి చెప్పారు..ఈ హత్యలో వివేక రాసిన లేఖకు ఎవిడెన్స్ అన్నారు. ప్రసాద్ మంచి వాడు అని దాచి పెట్టమని రాజశేఖర్ రెడ్డి చెప్పారు.

# నంద్యాల అభివృద్ధి జరిగిందంటే శిల్పా కుటుంబంతో నే

శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్యే



నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27 విభారె న్యూస్ :-నంద్యాల అభివృద్ధి జరిగిందంటే అది శిల్పా కుటుంబంతోనే అని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. గురువారం నాడు గడపగడపకు మన ప్రభుత్వం లో భాగంగా 42 వార్డు బయట పేటలో కౌన్సిలర్ శిరిషా వార్డు ఇంచార్జీ కిరణ్ ఆధ్వర్యంలో వార్డు లోని లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి తెలయ జేస్తూ కరపత్రాలను అందించారు. వార్డు ప్రజలు మరో సారి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రావాలని దీవించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా , మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్ పామ్ శవలి, అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిమ్మ నాగన్న వైఎస్ఆర్సిపి కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు వార్డు వైసిపి నాయకులు పాల్గొన్నారు

# మే 31 న సిద్దేశ్వర అలుగు దీక్షను జయ ప్రదం చేయండి

బొజ్జా దశరథరామిరెడ్డి.



నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27 విభారె న్యూస్ :-చట్టబద్ద నీటి హక్కులకై రాయలసీమలో ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన ఏడవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించుకుందామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ..సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన ఏడవ వార్షికోత్సవ సందర్భంగా మే 31 సాయింత్రం 7 గంటల నుండి జూన్ 1 ఉదయం 10 గంటల వరకు నిర్వహించే సంగమేశ్వరం దగ్గర జరిగే "సిద్దేశ్వరం అలుగు ప్రజా జాగరణ దీక్ష" ను విజయవంతం చేయాలని రాయలసీమ ప్రజానీకాన్ని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, చెరుకూరి వెంకటేశ్వర నాయుడు, కొమ్మా శ్రీహరి, భాస్కర్ రెడ్డి, సౌదాగర్ ఖాసిం మియా, నిట్టూరు సుధాకర్ రావు, రాఘవేంద్ర గౌడ్ పాల్గొన్నారు..

# అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుల డిమాండ్.

నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27 విభారె న్యూస్ :-నంద్యాల జిల్లా కేంద్రంలోని నరసింహ భవన్ లో గురువారం నాడు ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి రమేష్ కుమార్ అధ్యక్షత వహించారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్ కార్యక్రమాల రిపోర్టును ప్రవేశపెట్టారు. .ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపులో మోసం చేశాయని గత సంవత్సరం కంటే బడ్జెట్ కేటాయింపులు తగ్గించాలని వాటి ఫలితంగా ఎరువుల ధరలు విపరీతంగా పెరిగి రైతులపై భారం పడుతుందన్నారు. ప్ సీ ఐ. కి కేటాయించే నిధుల్లో కోత విధించడం వల్ల రైతుల పంటలు వరి గోధుమ మద్దతు ధరలు అమలు చేయని పరిస్థితి ఏర్పడిందన్నారు. ధరల స్తి రీకరణ నిధులు కేటాయించకపోవడం మద్దతు ధరలు అందడం లేదని,ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టాల నుండి రైతన్న ఆదుకోవడం లేదన్నారు .పంటల బీమా సక్రమంగా అమలు చేయడం లేదు వాటి ఫలితంగా రైతాంగం ఆత్మహత్యలు పెరుగుచున్నవి .విద్యుత్ మోటార్ల కు మీటర్లు పెట్టే విధానాన్ని స్వస్తి పలకాలని, నేషనల్ హైవే రోడ్లు ప్రాజెక్టుల వల్ల భూములు కోల్పోతున్న రైతాంగని ఆదుకోవడానికి 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని వాటిని అమలు చేయకపోతే రైతులు నష్టపోవడం జరుగుతుందన్నారు. .అకాల వర్షాల వల్ల మిరప మొక్కజొన్న అరటి మామిడి బత్తాయి ఉల్లి రైతుల పంటలు నష్టపోయారని వాటినిప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు రైతులతో కలిసి నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశం లో జిల్లా నాయకులు రామేశ్వరరావు, రామచంద్రుడు, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# అన్నదాతల ఆక్రందనను గుర్తించండి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు





కర్నూల్ ప్రతినిధి ఏప్రిల్ 27 విభారే న్యూస్. అకాల వర్షానికి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు దెబ్బతిన్నాయని, వెంటనే ప్రభుత్వం అన్నదాతల ఆక్రందన గుర్తించాలని వారిని ఆదుకోవాలని కర్నూల్ డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తూరు సత్యనారాయణ గుప్త ఒక ప్రకటనలో కోరారు. గురువారం సాయంత్రం విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ పండించిన పంట చేతికి అందుతున్న తరుణంలో అకాల వర్షం కారణంగా పంటలు తడుస్తుంటే అన్నదాతల పడరాని పాట్లు పడుతున్నారని వారి అవస్థలను చూస్తుంటే కన్నీరు రాక తప్పదు అన్నారు. లక్షలు ఖర్చుపెట్టి సాగు చేస్తే వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో అకాల వర్షాలు రైతులకు కన్నీరు తెచ్చిపెట్టిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారిని ఆదుకోవాలని వారి సందర్భంగా డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో కుండబోత వర్షం కారణంగా మిరప తో పాటు ఉద్యాన పంటలకు నష్టం కలిగించిందన్నారు. పంట చేతికి వచ్చి చేసిన అప్పులు తీర్చే సమయంలో అకాల వర్షాలు అన్నదాతలను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. వారి పంటలను కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వారు కోరారు. అకాల వర్షాలు పడుతున్న శాసనసభ్యులు, మంత్రులు ఎవరు కూడా రైతుల కష్టాలను తెలుసుకొనే ప్రయత్నాలు చేయడం లేదని వారు విమర్శించారు. అకాల వర్షాల కారణంగా పలు మండలాలలో పలు గ్రామాలలో తీవ్ర నష్టం వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన పంటకు డిమాండ్ ఉండదని ప్రభుత్వం సహృదయంతో ఆదుకోవాలని అన్నారు. ఓవైపు వలసలు మరోవైపు అకాల వర్షాలతో రైతుల బతుకులు చితికి పోయాయన్నారు. త్వరలో దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటించి రైతులు పడుతున్న అవస్థలను ఇబ్బందులను త్వరలో ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామన్నారు. వరి కోతలు మొదలు కావడంతో భారీ వర్షం కారణంగా నష్టం కలిగిందన్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా వారు కోరారు.

# వివేక హత్య కేసులో ఆ ముగ్గుర్ని కాపాడటానికే ప్రయత్నాలు

- సీబీఐ దర్యాప్తు అధికారిపై అవినాష్ రెడ్డి ఆరోపణలు



పులివెందుల .వివేక హత్య కేసులో తనపై వస్తున్న ఆరోపణలకు సుదీర్ఘ వివరణ ఇస్తూ వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డి వీడియో రిలీజ్ చేశారు. ఓవైపు గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయడం... సాయంత్రం అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్‌పై విచారణ జరగనున్న వేళ ఈ వీడియో విడుదల సంచలనంగా మారుతోంది. ఎవర్నో కాపాడేందుకు సీబీఐ విచారణను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు అవినాష్ రెడ్డి. హత్య జరిగిన రోజు ఏం జరిగిందో ప్రజలందరికీ తెలియాలని సుమారు ఏడు నిమిషాల నిడివితో ఓ వీడియోను విడుదల చేశారు. ఆయన ఏమన్నారంటే..."నాకు శివప్రకాష్ రెడ్డి ఆరుగంటలకు ఫోన్ చేశారు. అప్పటిగే జమ్మలమడుగు వెళ్తున్నాను. జీకే కొండారెడ్డి అనే లీడర్ పార్టీలో జాయన్ అవుతున్నారు. అక్కడే బ్రేక్ ఫాస్ట్ చేయాలని కూడా అనుకున్నాను. పులివెందుల రింగ్ రోడ్ వద్ద ఉన్నాను శివప్రకాష్ రెడ్డి ఫోన్ చేశారు. అర్జెంట్‌గా వివేకం బావ ఇంటికి వెళ్లు అన్నారు. ఎందుకు అంకుల్ అని అడిగితే.. బావ చనిపోయారు అని చెప్పారు. వెంటనే నేను వివేక ఇంటికి వెళ్లాను. సార్ వివేక చనిపోయారు బాత్‌రూమ్‌లో డెడ్‌బాడీ ఉందీ అని అక్కడే ఉన్న కృష్ణారెడ్డి నాకు చూపించారు. బెడ్‌రూం నుంచి బయటకు వచ్చే ముందు మరోసారి అడిగాం. ఏమైనా అనుమానాస్పదంగా ఉన్నాయా అంటే ఏం లేవు అని అడిగారు. అప్పటికే మేం వెళ్లకు ముందు ఏం జరిగిందో ప్రజల ముందు పెడుతున్నాను. మేం వెళ్లక ముందే అక్కడ వివేక రాసిన లెటర్ ఉంది. ఒక మొబైల్ ఫోన్ ఉంది. ఆ రెండు ఉన్న విషయాన్ని అల్లుడు రాజశేఖర్ రెడ్డికి పీఏ కృష్ణారెడ్డ చెప్పారు. రెండో ఆలోచన చేయకుండా ఆ లెటర్ దాచిపెట్టమని చెప్పారు. మొబైల్ ఫోన్ కూడా దాచి పెట్టు అని చెప్పారు.ఆ లెటర్‌లో వివేక ఏం రాశారంటే... నేను డ్యూటీకి త్వరగా రమ్మని చెప్పానని డ్రైవర్ చచ్చేలా కొట్టినాడు. ఈ లెటర్ రాసేందుకు నేను చాలా కష్టపడ్డాను డ్రైవర్ ప్రసాద్‌ను వదిలిపెట్టవద్దు. డ్రైవర్‌ను వదిలి పెట్టవద్దు అని రాశారు. దీన్ని దాచి పెట్టమని కృష్ణారెడ్డికి రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. ఈ లెటర్ ఈ కేసులో కీ ఎవిడెన్స్. ఈ లెటర్ ఎందుకు దాచి పెట్టారని అడిగితే... ప్రసాద్ చాలా మంచోడు అని సునీత, రాజశేఖర్ రెడ్డి చెప్తున్నారు. ప్రసాద్‌ను ఎవరైనా ఏమైనా అంటారేమో అని దాచి పెట్టామని అంటున్నారు. ఇది చాలా హాస్యాస్పదంగా లేదా... మీ నాన్ని చివరి సారిగా రాసిన లేఖ, చెప్పిన మాటలను నమ్మరా? ప్రసాద్‌నే ఎక్కువగా నమ్ముతారా? సీబీఐ స్టేట్‌మెంట్స్‌లో కూడా ఓ సారి ఒకలా మరోసార మరోలా చెప్పారు. మిస్టేక్స్‌ను కవర్ చేస్తూ మరో స్టేట్మెంట్ ఇచ్చారు. అలా స్టేట్మెంట్ స్టేట్‌మెంట్‌కు మిస్టేక్స్ కవర్ చేసుకోవడానికి కూడా సీబీఐ వాళ్లకు స్వేచ్ఛ ఇచ్చింది. ఈ లెటర్ దాచి పెట్టడం అనేది పోలీసులకు ఇన్‌టైంలో చెప్పకపోవడం ఈ కేసులో బిగ్గెస్ట్ బ్లండర్. అలాంటి విషయాన్ని సీబీఐ ఐవో రాంసింగ్ తగ్గించి వేరేలా కేసును విచారిస్తున్నారు. సీబీఐ మొత్తాన్ని తప్పుపట్టే పెద్దవాడిని కాదు కానీ... ఈ ఐవో రాంసింగ్ వైఖరి మాత్రం తేడాగా ఉంది. ఎవర్ని కాపాడటానికి ఈ ప్రయత్నం చేస్తున్నారు. సునీతను, రాజశేఖర్‌రెడ్డిని, శివప్రకాష్ రెడ్డిన కాపాడటానికే ఇలా చేస్తున్నారా? తప్పుగా మీరు చేసేది. మర్డర్ అని చెప్పడానికి ఈ లెటర్ కీలక ఆధారం. అలాంటి లెటర్‌ను దాచి పెట్టడం ఇంకా పెద్ద నేరం. పోనీ దాచిపెట్టారు. తర్వాతైనా పోలీసులకు ఆ లెటర్ సంగతి చెప్పి ఇవ్వొచ్చు కదా. మీరు ఎందుకు పోలీసులకు చెప్పలేదు. ఎందుకు ఫోన్ చేసి చెప్పలేదు. ఆరున్నరకు శివప్రకాష్ నాకు ఫోన్ చేసిన తర్వాత వెళ్లి అరౌండ్ 6.45కి నేను పోలీసులకు ఫోన్ చేసి చెప్పాను. మీకు 6.10కే డెత్ న్యూస్ తెలుసు. వివేకా చనిపోయినట్టు 6.10కి తెలిసిన తర్వాత లెటర్ తెలిసిన తర్వాత అందులో కంటెంట్ కృష్ణారెడ్డి మీకు చదివి వినిపించిన తర్వాత అది మర్డర్ అని తెలిసిన తర్వాత ఎందుకు పోలీసులకు చెప్పలేదు. నన్ను వెళ్లమన్నప్పుడైనా చెప్పాలి కదా. నాపై నమ్మకం లేకపోతే నన్ను ఎందుకు వెళ్లమని చెప్పారు. అంటే మీ ఉద్దేశాలు తప్పు. మీ సైడ్ తప్పు ఉంది. కాబట్టే కావాల్సి లెటర్ విషయాన్ని, మర్డర్ విషయాన్ని దాచి పెట్టారు. ఊరికే నన్ను వెళ్లమని చెప్పారు. నేను సీఐకి ఫోన్ చేసి వివేకానందరెడ్డి చనిపోయారు. చాలా బ్లడ్ ఉంది. నేను సీఐకి చెప్పింది ఇదే. అని వీడియోను ముగించారు

# ఉచిత విద్యుత్‌కు ఎసరు

## కేంద్రం కుట్రలకు బలి కావద్దు

## స్మార్ట్ మీటర్ల పై విపక్షాల మండిపాటు

విజయవాడ,ఏప్రిల్27: వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మొదలైన ఉచిత విద్యుత్‌కు మంగళం పాడే కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ మండిపడింది. విద్యుత్ ఉత్పత్తిని పెంచే ప్రయత్నాలు పెంచాలన్నారు. నిరంతర విద్యుత్ ఇచ్చే దిశగా రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించాలన్నారు. దీనికి ముందే కేంద్రం కొత్త విద్యుత్ సంస్కరణ పేరిట ముసాయిదా పంపించింది. అందులో విద్యుత్‌ను ఉత్పత్తి వ్యయం కంటే తక్కువకు ఇవ్వరాదని నిర్దేశించింది. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర నామమాత్రం చేసి ప్రైవేటు పెత్తనానికి రంగం సిద్ధం చేస్తున్నది. ఈ ప్రకారం చూస్తే ఆరు రూపాయల పైన యూనిట్‌కు విద్యుత్ తయారీ ఖర్చు లెక్కకట్టినప్పుడు రాష్ట్రం రెండురూపాయల లోపుగానే సబ్సిడీ ఇవ్వడం అనుమతించ బడుతుందని కాంగ్రెస్ నేత తులసిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఇది సహజంగానే ఉచిత విద్యుత్‌పై కేంద్రం పెత్తనానికి నిదర్శనం గా చూడాలన్నారు. ఇకముందు సహజంగానే ఉచితం అని అనడానికి ఆస్కారం ఉ ండదన్నారు. ద్రవ్యలోటు పరిమితికి మించి అప్పులు తెచ్చుకోవడాన్ని అనుమతించాలంటే కేంద్రం నాలుగు షరతులు పెట్టడంలో ఆంతర్యం ఇదేనని అన్నారు. ఒకే రేషన్, పట్టణ పాలక సంస్థ స్వయం సమృద్ధి, స్మార్ట్ మీటర్లు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పెంచడం అనే ఈ షరతులన్నీ ఆచరణలో ప్రజలపై భారం పెంచడానికి తప్ప మరోటి కాదని సిపిఎం నేత అభిప్రాయపడ్డారు. ప్రైవేటు కార్పొరేట్ల ప్రయోజనాలకు దారితీసే చర్యలను బిజెపి మరింత వేగం చేసిందన్నారు. స్మార్ట్ మీటర్లు ఎందుకంటే ప్రభుత్వం వారికి నగదు బదలాయించి మళ్లీ కట్టించుకోవడం కోసమని చెబుతున్నారు. అయితే ఈ ప్రక్రియ అంత సులభం కాదన్నారు. నాలుగు పత్రాలు రైతు పేరు, భూయాజమాన్య పత్రం, ఆధార్ కార్డు బ్యాంకు ఖాతా అన్నీ సరిపోలితేనే బిల్లు చెల్లించడం జరుగుతుంది. అలాగే అనధికారిక పంపుసెట్లను క్రమబద్దీకరించుకోవడానికి చాలా వ్యయ ప్రయాసలు వడపోతలు ఎదురవుతాయి. ఇదంతా దేనికంటే ఖచ్చితంగా వ్యవసాయానికే ఈ కరెంటు వాడుతున్నట్టు నిర్ధారించుకోవాల్సి కూడా ఉంటుంది.

# నంద్యాల జిల్లా రవాణా శాఖ అధికారి గా జి.వి శివా రెడ్డి



నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27 విభారె న్యూస్ :-.. నంద్యాల జిల్లా ప్రాంతీయ రవాణా శాఖ అధికారిగా జి వి శివారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆదోని యందు పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

# మహానంది క్షేత్రంలో వైభవంగా వార్షిక పుష్కరోత్సవము

ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి



నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27 విభారె న్యూస్ :-మహానంది క్షేత్రంలోని (నందితీర్థంలో) పుష్కరిణిలో గురువారం వైశాఖ శుద్ధ సప్తమి ఉత్సవం ఘనంగా నిర్వహించిన ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి . గురువారం ఉదయం 6-00 గంటలకే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు . స్నానం వలన సంపూర్ణ పుష్కర స్నాన బలముతో పాటు గంగాదేవి తో కలిసి స్నానమాచరించిన ఫలమును,మోక్షము దక్కుతుందని వారు అన్నారు. వార్షీకంగా మహానంది క్షేత్రంలోని నందితీర్థంలో వైశాఖ శుద్ధ సప్తమి నాడు జరిగే అద్భుతం అమోఘమైనదని . ఈరోజున గంగాదేవి స్వయంగా ఇక్కడి తీర్థానికి చేరుకుని సంకల్ప స్నానమాచరించి తను శుద్ధిని పొందుతుందని స్వయంగా పురాణేతిహాసాలు చెబుతున్నారని అన్నారు . 12సంవత్సరాలకు ఒకమారు వచ్చే గంగా నది పుష్కరాల స్నానమును గంగ జన్మించిన స్థలంలో చేస్తే ఎంతటి పుణ్యఫలమో ఈ మహానంది తీర్థంలో వైశాఖ శుద్ధ సప్తమి రోజున చేసే స్నానం అంతే పుణ్యప్రదమైనదని వారు తెలిపారు .ఈ కార్యక్రమంలో నిత్యం మహానంది దేవస్థానం నిర్వహిస్తున్న అన్న దానంకు కూరగాయలు వితరణ చేస్తున్న మార్కెట్ ప్రసాద్ పాల్గొన్నారు.

# అత్తింటి వేధింపులకు గృహిణి ఆత్మహత్య

## నిన్ను నువ్వు ప్రశ్నించుకో.. భర్తకు మృతురాలి చివరి లేఖ వైరల్

విశాఖపట్టణం ఏప్రిల్ 27 విశాఖ ఆర్కే బీచ్ లో శవమై లభ్యమైన యువతి ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. మొదట్లో ఇక్కడ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు యువతి ఆత్మహత్యగా భావించారు. వివరాలు రాబట్టిన తరువాత ఆమె పేరు శ్వేతగా.. ప్రస్తుతం ఆమె 5 నెలల గర్భిణీ గా తేలడంతో మరింత లోతుగా లోతుగా విచారణ జరిపారు. ఈ సందర్భంగా పోలీసులు శ్వేత రాసిన ఓ లెటర్ ను బయటపెట్టారు. ఇందులో శ్వేత రాసిన కొన్ని వ్యాఖ్యలను పరిశీలిస్తే కుటుంబ సమస్యలతోనే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇందులో 'నిన్ను నువ్వు ప్రశ్నించుకో..' అని భర్తను ఉద్దేశించి రాయడంపై తీవ్రంగా చర్చించుకుంటున్నారు.శ్వేత కుటుంబ సమస్యలతో తీవ్రంగా మనోవేదన చెందినట్లు తెలుస్తోంది. ఆమె ఆత్మహత్య చేసుకునే ఒకరోజు ముందు ఓ లెటర్ ను రాసి ఇంట్లో పెట్టి రాత్రి 7 గంటల ప్రాంతంలో ఆమె బయటకు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ సమయంలో ఆమె బ్లూ గౌన్ వేసుకున్నారని అంటున్నారు.అయితే అంతకుముందే అత్తమామలు ఆసుపత్రి పనిమీద బయటకు వెళ్లి తిరిగి వచ్చారు. ఈ సమయంలో శ్వేత కనిపించకపోవడంతో రాత్రి 12 గంటల వరకు వేచి చూశారు. ఆ తరువాత న్యూ పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అదృశ్యం కేసుగా నమోదు చేశారు.విశాఖ రైల్వే ఆసుపత్రిలో శ్వేత నర్సుగా పనిచేస్తున్నారు. గాజువాక సమీపంలోని ఉక్కు నిర్వాసితుల కాలనీకి చెందిన సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గురువిల్లి మణికంటతో ఏడాది కిందట వివాహం అయింది. అయితే 15 రోజులు కిందట మణికంత కార్యాలయం పనిమీద హైదరాబాద్ కు వెళ్లారు. దీంతో శ్వేత అత్తమామలతోకలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో ఆమె చనిపోయే ముందు రోజు తన భర్త మణికంతతో చాలా సేపు ఫోన్లో మాట్లాడినట్లు వివరాలు సేకరించారు. ఈ సమయంలో వీరి మధ్య మాటా మాటా పెరిగిందని తెలుస్తోంది.ఈ క్రమంలో ఆమె ఓ లెటర్ రాసి బయటకు వెళ్లింది. ఈ లెటర్ లో 'నేను లేకుండా నువ్వు హ్యాపీగా ఉండగలవని నేను అనుకుంటున్నా.. ఏదేమైనా నీ ఫ్యూచర్ న్యూ లైఫ్ కు ఆల్ ది బెస్ట్.. నీతో చాలా మాట్లాడాలని ఉంది. కానీ నేనేమీ మాట్లాడలేకపోతున్నా.. అయితే ఒకసారి 'నిన్ను నువ్వు ప్రశ్నించుకో..' అని లెటర్ లో రాసి ఉంది.ఈ లెటర్ ను చూసి శ్వేత తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. తమ కూతురు అత్తింటి వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకుందని ఆరోపిస్తున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190